క్లుప్తంగా

వృద్ధులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ అధికారి రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టీబీరోడ్డు సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు నిండిన వృద్ధులకు బుధవారం కంటి పరీక్షలు చేశారు. ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వృద్ధులకు జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేశారు. వృద్ధాప్యంలో కంటి చూపు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్‌కుమార్, వార్డు అడ్మిన్ సునీల్‌కుమార్‌రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయన ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

చాపాడు: పల్లవోలు సమీపంలోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ నరాల బాలిరెడ్డి 2వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబీకుల సహకారంతో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్ బీమా అందజేత



రూ.10 వేలు నగదును మృతుని భార్యకు అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

కలసపాడు : మండలంలోని తెల్లపాడుకు చెందిన కాకర్ల గుర్రప్ప ఈ నెల 21వ తేదీన గొర్రెలు మేపుకుంటుండగా పిడుగుపాటు పడి మృతి చెందాడు. ఈయన వైఎస్సార్ బీమా చేయించుకోవడంతో బుధవారం మృతుని భార్య రమాదేవికి రూ.10 వేలు నగదును డిజిటల్ అసిస్టెంట్ మస్తాన్ చేతులమీదుగా అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలు మృతుని భార్య రమాదేవి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయన్న, బాలయ్య, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లో పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ



పేపర్‌తో వస్తువులు తయారు చేసే విధానం చెబుతున్న ప్రసాదరెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రంథాలయంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌లో బుధవారం సీనియర్ సిటిజన్ కొండా ప్రసాదరెడ్డి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. పేపర్లతో వివిధ రకాల బొమ్మలు ఎలా చేయవచ్చో ప్రదర్శించారు. పడవ, పాము, కిరీటం, టోపీలు, డ్రస్ తదితర వస్తువులను కేవలం పేపర్‌తో ఎంత సులభంగా తయారు చేయవచ్చో పిల్లలకు నేర్పించారు. మిమిక్రీ చేసి పిల్లలను అలరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అఫ్రిది, జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాదాపీర్ పాల్గొన్నారు.

నేడు అల్లాడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి దేవర



పూజలందుకుంటున్న పెద్దమ్మతల్లి

దువ్వూరు : మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో బుధవారం గ్రామ దేవత పెద్దమ్మ తల్లి దేవర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు బండలాగుడు పోటీలు

పెద్దమ్మతల్లి దేవర ఉత్సవం సందర్భంగా వృషభరాజములకు బండలాగుడు పోటీలు గురువారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందిస్తామని వారు పేర్కొన్నారు.

ఏపీని ఆదర్శంగా నిలిపిన సీఎం

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలో ఆదర్శ రాష్ట్రంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిపారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని నంద్యాలంపేట పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలోని విప్పరాపురం, గాం. దీనగర్, వరదాయపల్లె ఎస్సీ కాలనీల్లో ఇంటింటికి తిరిగిన ఎమ్మెల్యే నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మన రాష్ట్రంలోని పథకాలను అక్కడ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలను, పురుగు మందులను అందిస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేయిస్తున్నారని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, పనిచేయలేని కళాకారులకు తెల్లవారుజామునే పింఛన్ అందజేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన అందిస్తూ ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు.

సమస్యలపై స్పందన

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందించారు. విప్పరాపురంలో, మూడుమాండ్లు గ్రామాల్లో తమకు సాగు భూములు మంజూరు కాలేదని, ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెప్పగా విప్పరాపురం, మూడుమాండ్లలో తెలుగుగంగ ముంపు బాధితులకు ఇచ్చిన భూములు జెడ్‌పిహెచ్‌డీసీ నుంచి ప్రభుత్వ భూములుగా మార్చాల్సి ఉందని, ఆ ప్రక్రియ ఆలస్యం అవుతున్నందున భూముల పంపిణీ జరగలేదని ఎమ్మెల్యే వివరించారు. తప్పకుండా సాగు భూములు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. గాంధీనగర్ ఎస్సీ కాలనీలో పక్కా ఇళ్లు, ఇంటి స్థలాలు కావాలని పలువురు అడగగా వెంటనే ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నంద్యాలంపేట సర్పంచ్ చెన్నూరు ఓబయ్య, ఎంపీపీ కడప థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్‌ఖాన్, ముడుమాల వేణుగోపాల్‌రెడ్డి, ఎంఎస్ఆర్, ఎల్.సుబ్బిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, రామశివారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, ఆప్కో డైరెక్టర్ వెంకటేష్, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఎంఈఓ పద్మలత, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు రామభద్రయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్ బాబు, బ్రహ్మనందరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి వైఎస్సార్ కేపీ ఏపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలో పాత గంగమ్మ దేవాలయం వద్ద బుధవారం నుంచి గంగ జాతర (ఆవుల పబ్బం) ఘనంగా ప్రారంభమైంది. ఉదయం గ్రామ దేవతలకు పూజలు, సాయంత్రం అమ్మవారికి జల్దిస్థానం అఖండ జ్యోతి, కలశ స్థాపన చేశారు.

28న రాష్ట్రస్థాయి సీనియర్స్ వృషభరాజముల పోటీలు

గంగ జాతరను పురస్కరించుకొని ఈ నెల 28న ఆదివారం ఉదయం 7గంటల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి సీనియర్స్ వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన వృషభరాజములకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.1,00,016, రూ.70,000, రూ.50,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000లను అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజుపాళెం : దువ్వూరు మండలంలోని గుడిపాడు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రాజుపాళెం మండలంలోని నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

గోవాకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి విహార యాత్రకు కడప రీజియన్‌లోని కడప, మైదుకూరు డిపోల నుంచి ఈనెల 26, 27 తేదీలలో గోవాకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి ఇంద్ర ఏసీ సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ బస్సులో ఒక్కొక్కరికి టిక్కెట్ రూ. 3074లుగా నిర్ణయించామన్నారు. అలాగే 27న మైదుకూరు డిపో నుంచి వయా ప్రొద్దుటూరు మీదుగా సూపర్ లగ్జరీ సర్వీసును నడుపుతున్నామన్నారు. ఇందులో చార్జీ రూ. 2386గా ఉందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీపీపీ సీఈకి ఘన స్వాగతం

కడప కల్చరల్ : రాయలసీమ థర్మల్ విద్యుత్‌కేంద్రం (ఆర్టీపీపీ) నూతన సీఈగా బాధ్యతలు స్వీకరించిన టి.నాగరాజుకు మైనార్టీ సంఘ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఆయన కార్యాలయంలో కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రికల్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఆయనకు పూల బొకేను అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతన సమస్యలను ఆయనకు వివరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సీఈ హామీ ఇచ్చారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

శేష వాహనంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం కుంభప్రతిష్ట, అగ్నిప్రతిష్ట, నిత్యహోమం, మూలవిరాట్‌లకు అభిషేకం, ఉత్సవబలి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే సాయంత్రం ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి గుడిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

కడపలో మొల్ల అకాడమీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

గోపవరం : వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో తెలుగు రామాయణ తొలి రచయిత్రి మొల్ల పేరుతో తెలుగు అకాడమీ ఏర్పాటు చేయాలని కవయిత్రిమొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంటహనుమంతరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని మొల్ల మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాలివాహన వంశంలో జన్మించిన మొల్ల ఏడు దశాబ్దాల క్రితమే మహిళా సాధికారతకు పాటు పడ్డారన్నారు. తన రామాయణ రచనలో సీతాదేవికి ఇతర మహిళలకు పెద్దపీట వేసి మహిళా ఔన్నత్యానికి కృషి చేశారన్నారు. తెలుగుభాష సుసంపన్నం కోసం తన పేరుతో మొల్ల రామాయణాన్ని సరళమైన భాషలో రచించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి జిల్లా కేంద్రమైన కడపలో మొల్ల పేరుతో తెలుగు అకాడమీ నెలకొల్పాలని కోరారు. ముందుగా మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్ల సాహితీపీఠం కోశాధికారి గుమ్మళ్ల శ్రీనివాసులు, పెంచలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఓబులాపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కాశినాయన : మండలంలోని ఓబులాపురం గ్రామంలో రామాలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో వేదపండితులు ఘనంగా కల్యాణం జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. భావన, శ్రీవిద్య, శ్రీగీతం, నారాయణ, దీప్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలను పురస్కరించుకుని పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

వలంటీర్ల సన్మాన సభలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



గోపవరంలో సేవారత్న వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, అధికారులు, ప్రజాప్రతినిధులు

గోపవరం : వలంటీర్లు సంక్షేమ వారధులు అని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి వీరు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నేరుగా వారి ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించే వలంటీర్ల సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీలు ప్రతిపాదించిన వారికే వచ్చేవని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎవరి ప్రమేయం లేకుండానే రేషన్ కార్డు దగ్గర నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అందించే స్వేచ్ఛను వలంటీర్లకు కల్పించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాక పారిశ్రామిక రంగంలో కూడా ఒక నూతన ఒరవడి తీసుకువచ్చారన్నారు. నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, మరో ఏడాది పాలనలో మరింత మంచి చేకూరుతుందని వారు పేర్కొన్నారు. గోపవరం మండలంలో సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటు చేయడం వలన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే కాక ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, లక్ష్మీదేవి, సరిత, నాగేంద్ర, రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరస్వతి, మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోవిందరెడ్డి, సచివాలయాల కన్వీనర్ పుల్లయ్య, పార్టీ నాయకులు కె.రమణారెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సాంబశివారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్‌డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ అటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జెడ్పీటీసీ దావీదు ముఖ్యఅతిథులుగా హాజరై సచివాలయంలో ఉత్తమ ప్రతిభ చాటిన వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దార్ విద్యాసాగర్, ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నివాళులు



మహానందరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ

అట్లూరు : అనారోగ్యంతో మృతి చెందిన మద్దిక మహానందరెడ్డి(30) మృతదేహానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా బుధవారం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్దకామసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిక పెద్దమునిరెడ్డి కుమారుడు మహానందరెడ్డి ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉండగానే క్యాన్సర్ బారిన పడ్డాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్. సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, కామసముద్రం, వేమలూరు సర్పంచులు ఆర్‌వీ సుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, శివారెడ్డి, వరదరాజుపల్లి రమణారెడ్డి తదితరులు పెద్దకామసముద్రం గ్రామానికి చేరకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అత్యవసర సమయంలో చికిత్స అందించేలా శిక్షణ



క్యాన్‌లా ద్వారా ఇంజక్షన్ వేసే విధానాన్ని నేర్చుకుంటున్న సీహెచ్‌ఓ

ప్రొద్దుటూరు క్రైం : అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్స అందించేలా సీహెచ్‌ఓలకు శిక్షణ ఇస్తున్నట్లు నోడల్ అధికారి శివశంకరయ్య తెలిపారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో సీహెచ్‌ఓలకు విలేజ్ క్లినిక్‌లలో ప్రాథమిక చికిత్స ఎలా నిర్వహించాలన్న దానిపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రోగ్రాం నోడల్ అధికారి మాట్లాడుతూ ఇకపై విలేజ్ క్లినిక్‌లో అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్సను కూడా సీహెచ్‌ఓలు అందిస్తారన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా ఆస్పత్రిలోని వార్డుల్లో నిర్వహిస్తున్న వైద్యం గురించి సీహెచ్‌ఓలకు తెలియచేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం చారిత్రక అవసరం



మరో గ్రంథాలయ ఉద్యమం యాత్ర ర్యాలీలో ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మరో గ్రంథాలయ ఉద్యమం చారిత్రక అవసరమని మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లా కొండేపి మండలం జాల్లపాలెం ఉపాధ్యాయుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి ఈనెల 18న ఒంగోలు నుంచి బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర బుధవారం ప్రొద్దుటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా హోమస్‌పేటలో ఆయన పలువురు విద్యావేత్తలు, సాహిత్యకారులు, మేధావులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్స్‌ను వీడి పుస్తకపఠనం వైపు ఆసక్తిని పెంచాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ బాధ్యతను తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రజ్యోతి సాహితీ సంస్థ కార్యదర్శి మహమూద్, సభ్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ దస్తగిరి, విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి, ప్రముఖ కథారచయిత దాదా హయాత్, సృజన సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, పౌర హక్కుల సంఘం కార్యదర్శి సురేష్‌బాబు, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాయలసీమ విద్యార్థి వేదిక హరిత, మహిళా శక్తి కన్వీనర్ వల్ల లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

• అపూర్వ సమ్మేళనం



మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో ఘనంగా జరుపుకున్నారు. 1986-1991 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులందరూ కలుసుకున్నారు. అప్పటి కొందరు ఉపాధ్యాయులు హాజరుకాగా మండలంలోని లక్ష్మీపేట, కేతవరం, విశ్వనాథపురం, బద్రిపల్లె, వీరభద్రాపురం ఇంకా పలు గ్రామాలకు చెందిన వారితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు సైతం హాజరయ్యారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ వారు చదువుకున్న పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. - చాపాడు